# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-09-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారతదేశపు తొలి జియోసింక్రోనస్ కక్ష్య ఇమేజింగ్ ఉపగ్రహం ఈఓఎస్-05ను ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది.**

2. **అమరావతిలో కొత్త భూ కేటాయింపులకు ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

3. **హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి వెల్లడించారు.**

4. **శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని దేశ వ్యాప్తంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో ఈరోజు జరుపుకుంటున్నారు.**

==========================

భారతదేశపు తొలి జియోసింక్రోనస్ కక్ష్య ఇమేజింగ్ ఉపగ్రహం ఈఓఎస్-05ను భారత అంతరిక్ష సంస్థ-ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ తెల్లవారుజామున జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని చేపట్టారు. ప్రయోగం జరిగిన సుమారు 18 నిమిషాల తర్వాత... 2 వేల 367 కిలోల బరువున్న అత్యాధునిక భూ పరిశీలన ఉపగ్రహం ఈఓఎస్-05ను సబ్-జియోసింక్రోనస్ కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టినట్లు ఇస్రో వెల్లడించింది. ఈ ప్రయోగంతో భారతదేశ భూ పరిశీలన సామర్థ్యాలు మరింత బలోపేతం అవుతాయని, భూ పరిశీలన సేవల పంపిణీ మరింత మెరుగుపడుతుందని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ తెలుపుతూ,

వాయిస్ ..30..సెకన్లు

--------------------------

గోదావరి నదిలో డ్రెయిన్ల ద్వారా కలుస్తున్న కాలుష్యంపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం నుంచి అంతర్వేది వరకు అన్ని ప్రధాన, ఉప డ్రెయిన్లను నిరంతరం పర్యవేక్షించి, నీటి నమూనాలను శాస్త్రీయంగా పరీక్షించాలని సూచించారు. పరిమితికి మించిన కాలుష్యం గుర్తిస్తే తక్షణమే నియంత్రణ చర్యలు చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' లక్ష్యంగా పుష్కరాల నాటికి నదిని కాలుష్యరహితంగా తీర్చిదిద్దాలని సూచించారు.

--------------------------

అమరావతిలో కొత్త భూ కేటాయింపులపై మంత్రుల బృందం చేసిన సిఫార్సులు, ఏపీసీఆర్‌డీఏ అథారిటీ తీర్మానాలకు ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి పాత్రికేయులకు వెల్లడించారు. రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తీసుకొచ్చిన 'పౌల్ట్రీ అభివృద్ధి విధానం–2025–29' ముసాయిదాకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. అమరావతిలోని శాఖమూరు వద్ద 'అమరావతి సంగమం' నిర్మాణాన్ని 759 కోట్ల రూపాయలతో చేపట్టేందుకు కూడా మంత్రివర్గం ఆమోదించిందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

అలాగే ఎల్‌నినో ప్రభావంతో ఆరుతడి పంటల విత్తనాల కోసం 90 వేల కిలోల విత్తనాలను సిద్ధం చేయడం, విత్తనాల రాయితీ కోసం 90 కోట్ల రూపాయల ఆర్థిక సాయానికి మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని మంత్రి వివరించారు.

-------------------------

హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో చంచల్‌గూడ నుంచి ఐఎస్ సదన్ కూడలి వరకు 3.3 కిలోమీటర్ల పొడవున, నాలుగు లైన్ల వెడల్పుతో, 620 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన చంచల్‌గూడ–సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ... హైదరాబాద్ పాతబస్తీ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మీరాలం ట్యాంకును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇందుకోసం 500 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయిన నేపథ్యంలో... పాతబస్తీలో ప్రతిపాదిత గౌలిగూడ–చాంద్రాయణగుట్ట మెట్రో రైలు విస్తరణ పనులను వచ్చే డిసెంబర్‌లో ప్రారంభించనున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు.

-------------------------

శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని ఈరోజు దేశ వ్యాప్తంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ప్రతి ఏడాది శ్రావణ మాసం కృష్ణ పక్షంలో వచ్చే అష్టమి తిథి రోజున ఈ పండుగ నిర్వహిస్తారు. కృష్ణాష్టమిని గోకులాష్టమి, అష్టమి రోహిణి, శ్రీ కృష్ణ జన్మాష్టమి, శ్రీ కృష్ణ జయంతి అని కూడా పిలుస్తారు. కృష్ణాష్టమి పురస్కరించుకుని ఈరోజు దేశ వ్యాప్తంగా అన్ని ప్రధాన దేవాలయాలలో ప్రత్యేకించి మధురలోని శ్రీ కృష్ణ ఆలయంలో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా వీధులలో ఉట్టి కొట్టడం ఈ పండుగలోని మరో ప్రత్యేక అంశం. శ్రీ కృష్ణాష్టమి పండుగని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

-------------------------

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆలయ కమిటీ నిన్న ఆహ్వానించింది. చిత్తూరు జిల్లాలోని పూతలపట్టు శాసన సభ్యులు మురళీమోహన్, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఛైర్మన్ సురేంద్రబాబు సచివాలయంలో ముఖ్యమంత్రిని

కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ నెల 14 నుంచి అక్టోబర్ 4 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని వారు ముఖ్యమంత్రిని కోరారు.

---------------------------

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో వినియోగదారులపై భారం పడకుండా చేపట్టాల్సిన మార్కెట్ ఇంటర్వెన్షన్ చర్యలపై ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ ఉపసంఘం నిన్న సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు మంత్రులు కె.అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. నిత్యావసరాల ధరలు, నిల్వలు, సరఫరాను నిరంతరం పర్యవేక్షించి, కృత్రిమ కొరతకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించిందని సమావేశం అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ పాత్రికేయులకు వివరిస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

రైతులు సమిష్టిగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు –ఎఫ్‌పీఓలుగా ఏర్పడితే మంచి లాభాలు పొందవచ్చని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా ఎఫ్‌పీఓల ప్రతినిధులతో మంత్రి నిన్న మాట్లాడారు. రసాయనిక వ్యవసాయానికి బదులుగా ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మళ్లాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ... పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గోదాముల నిర్మాణం చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. సరైన సమయంలో పంటలను విక్రయించడంతో పాటు, వాటిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి జిల్లా స్థాయి పర్యాటక ఉత్సవాలు, రోడ్‌షోలు నిర్వహించాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలో జరిగిన పర్యాటక శాఖ మార్కెటింగ్ కమిటీ సమావేశంలో మంత్రి పలు అంశాలపై నిన్న సమీక్షించారు. ఈసందర్భంగా ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు, గోదావరి పుష్కరాలు-2027కు విస్తృత ప్రచారం కల్పించడంపై చర్చించారు. పుష్కరాల సందర్భంగా భక్తులు, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలోని పలు ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.

తెలంగాణ రాష్ట్రంలోనూ రానున్న రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================